క్లుప్తంగా

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



ధర్పల్లి: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఆలిండియా బంజారా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తారాచంద్ నాయక్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని అవమానపరిచిన అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో బంజారా నాయకులు పాల్గొన్నారు.

విలీన సభను విజయవంతం చేయండి

డిచ్‌పల్లి: సీపీఎం(ఎంఎల్), న్యూడెమోక్రసీ రెండు పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని నిజామాబాద్ రూరల్ సెక్రటరీ జేపీ గంగాధర్ కోరారు. గురువారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో వీలీన సభ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ నెల 28న హైదరాబాద్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో రెండు పార్టీల విలీన సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. రాజు, సాయిలు,రాజమణి, గంగవ్వ, మల్లయ్య పాల్గొన్నారు.

అపోహలు నమ్మొద్దు



నిజామాబాద్‌నాగారం: రక్తదానం విషయంలో ఉన్న అపోహలను నమ్మవద్దని, రక్తదానం చేసేవారు మరింత ఆరోగ్యవంతులవుతారని లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్షుడు అబ్బాయి లింబాద్రి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానమన్నారు. రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. రక్తదానంతో ఎంతో మందికి అత్యవసర సమయాల్లో ప్రాణదానం చేసినవారిమవుతామని అన్నారు. రక్తం ప్రాధాన్యత తెలిసి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తరచూ రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ పి శ్రీనివాస్, ఇరుమల శివలింగం, చింతల గంగాదాస్, పి రాఘవేందర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు అక్రమం

నిజామాబాద్ అర్బన్: ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు అక్రమమని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేయడం తగదని, వెంటనే అతన్ని విడుదల చేయాలన్నారు. కుటుంబ సభ్యులకు కూడా కనీస సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి నోటీసులు అందించకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ఇది అప్రజాస్వామ్యకమని అన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాష్ట్ర పరువు, ప్రతిష్టలకు భంగం కలిగిస్తున్నారని పేర్కొన్నారు.

జనవరి 9న డిమాండ్స్ డేగా నిర్వహించాలి

నిజామాబాద్ సిటీ: ఇండియా ప్రొగ్రెసివ్ కిసాన్ సభ, సాదో, అసోం, బైటియాక్ సంత, త్రిపుర కృషక్ ముక్తి సంగ్రామ్, ఆలిండియా కాంత్రికారి కిసాన్‌సభలు కలిసిపోయి 'ఆలిండియా యునైటెడ్ కిసాన్ సభ'గా రూపాంతరం చెందినట్లు ఏఐయూకేఎస్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ గురువారం పేర్కొన్నారు. జనవరి 9న డిమాండ్స్ డే జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. సాగుచేసిన రైతులకు రైతు భరోసా ఇవ్వాలని, అర్హులకు తెల్ల రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 200 రోజుల పని దినాలు కల్పించాలని, ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



వేల్పూర్: సీఎం కప్ రాష్ట్రస్థాయి క బడ్డీ పోటీలకు మోతె హైస్కూల్ విద్యార్థి వేదాంశ్ ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ సురేశ్‌కుమార్ గురువారం పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి 29 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే సీఎం కప్ పోటీల్లో పాల్గొంటాడని అన్నారు. తమ స్కూల్ విద్యార్థి సీఎం కప్ పోటీలకు ఎంపిక కావడంపై హెచ్ఎం గణేశ్, పీడీ సురేశ్‌కుమార్, కబడ్డీ కోచ్ పరంజ్యోతి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా
- 132 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

సుభాష్‌నగర్: నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే తన మొదటి లక్ష్యమని, రాబోయే రోజుల్లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని అధునాతన సౌకర్యాలతో మెరుగైన వైద్యం అందించేలా కృషిచేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా కేంద్రంలోని పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 132 మంది బాధితులకు మంజూరైన రూ.30,50,600 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించినట్లు తెలిపారు. బాధితుల నుంచి దరఖాస్తులను స్వీకరించి.. ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే సీఎం సహాయనిధి కార్యాలయానికి పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం చెక్కుల జారీలో కొంత జాప్యం జరుగుతోందని, అలాగే దరఖాస్తు చేసుకున్న మొత్తంలో 15 శాతం నుంచి 20శాతం వరకే చెల్లిస్తుందని అన్నారు. తద్వారా పేద, మధ్యతరగతి బాధిత కుటుంబాలకు ఆస్పత్రుల ఖర్చు ఆర్థిక భారంగా మారిందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎంను నేరుగా కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కుల జాప్యం, దరఖాస్తు చేసుకున్న మొత్తంలో 50శాతం చెల్లించే బాధ్యత తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు న్యాలం రాజు, మల్లేశ్ యాదవ్, ఎర్రం సుధీర్, సాయివర్ధన్, ఇప్పకాయల కిశోర్, కార్యకర్తలు, మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

మోపాల్: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంజర భూమయ్య అన్నారు. సీపీఐ వంద సంవత్సరాల వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని తాడెంలో గ్రామ కార్యదర్శి గంగారాం ఆధ్వర్యంలో ఎర్రజెండాను రూరల్ నియోజకవర్గ కార్యదర్శి రాజేశ్వర్ ఆవిష్కరించారు. అనంతరం కంజర భూమయ్య మాట్లాడుతూ.. సీపీఐ పోరాటం లేకుండా అభివృద్ధి లేదని, ఎర్రజెండా కింద ఉద్యమిస్తూ ఎంతోమంది అమరులయ్యారని తెలిపారు. స్వాతంత్రోద్యమంలో ఎన్నో త్యాగాలు చేశారని, అలాగే తెలంగాణ రైతాంగ సాయుధ తిరుగుబాటు నిర్వహించి నైజాం రాజరిక పాలనను పారదోలి ప్రజలకు స్వేచ్ఛ కల్పించిందని గుర్తుచేశారు. గ్రామాభివృద్ధిలో సీపీఐ కార్యకర్తలు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం స్వామి, శ్రీను, పర్వయ్య, బి గంగారాం, రమేశ్, తవ్వన్న, గణేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాడెంలో మాట్లాడుతున్న కంజర భూమయ్య

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు సరికాదు

నిజామాబాద్ అర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు సరైంది కాదని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెను పీఆర్టీయూ అనే ఒక సంఘానికి ఆపదించడం చాలా బాధకరమని, అన్ని సంఘాల నాయకులు మాకు మద్దతు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా కందాళై పుస్తక ఆవిష్కరణ



నిజామాబాద్ రూరల్: ఇందూరు కవి కందాళైరాఘవాచార్య రచించిన విశ్వధ్యానం అనే యోగా ధ్యానం పుస్తక ఆవిష్కరణ గురువారం హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొమాండూరు మోహనాచార్యులు, అధ్యక్షుడు రూప్‌కుమార్ డబ్బీకార్, అతిథులు కందుకూరి శ్రీరాములు, బెల్లంకొండ సంపత్ కుమార్ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇందూరు జిల్లా బాల సాహిత్య అధ్యక్షుడు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గురుద్వారాలో వీర్ బాల్ దివస్

నిజామాబాద్ రూరల్: నగరంలోని గురుద్వారాలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ వీర్ బాల్ దివస్ కార్యక్రమాన్నిఇ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొగలుల రాక్షసత్వానికి వ్యతిరేకంగా గురు గోవింద్ సింగ్ కుమారులు సాహెబ్ జాదా అజిత్ సింగ్, సాహెబ్ జాదా జుజార్‌సింగ్ మొగలులతో వీరోచితంగా పోరాడి అమరులయ్యారని అన్నారు. మరో ఇద్దరు సాహెబ్ జాదా జోరావర్ సింగ్, సాహెబ్ జాదా పతే సింగ్లను ముస్లిం మతం స్వీకరించాలని ఒత్తిడి తెచ్చినా వారికి లొంగకుండా ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డ వీరులని కొనియాడారు. వారిని మొగలులు గోడలో సజీవ సమాధి చేశారన్నారు. వీరి త్యాగాలకు గుర్తుగా డిసెంబర్ 26న వీర్ బాల్ దివస్ నిర్వహించాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం గురుద్వారాలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాగి నారాయణయాదవ్, బద్దం కిషన్, నరేందర్, జస్పాల్‌సింగ్, గురుద్వారా పెద్దలు పాల్గొన్నారు.



ప్రార్థనల్లో పాల్గొన్న యెండల లక్ష్మీనారాయణ

అయ్యప్ప ఆలయంలో మండల పూజ



మండల పూజలో పాల్గొన్న స్వాములు, భక్తులు

బోధన్ టౌన్: పట్టణంలోని రాకాసిపేట్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం మండల పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు, అయ్యప్ప ఆలయ ప్రధాన అర్చకుడు సంతోష్ శర్మ, శివాలయం ప్రధాన అర్చకుడు గణేశ్ మహరాజ్ వేద మంత్రాల మధ్య ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. సుప్రభాత సేవ, అభిషేకం, సహస్ర నామార్చన, గణపతి హోమం, విశిష్ట పూజా కార్యక్రమాలు చేపట్టారు. అయ్యప్ప స్వాములకు, భక్తులకు దాతలు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం కన్నుల పండువగా అయ్యప్ప స్వామి పడిపూజ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా ట్రస్ట్ అధ్యక్షుడు శివన్నారాయణ, కార్యదర్శి ఐఆర్ చక్రవర్తి, కోశాధికారి కొయ్యాడ శ్రీనివాస్ గౌడ్, గురు స్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



హోమం చేస్తున్న స్వాములు

బిల్లురాక.. తారు వేయక..

- రూ.1.40కోట్లతో వంతెన నిర్మాణం
- రోడ్డుపై తారు వేయకుండా వదిలి వేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తొర్తి, మోర్తాడ్ మండలం పాలెం మధ్య ఉన్న మార్గంలో మినీ వంతెన నిర్మించి రోడ్డు వేసినా తారు వేయకపోవడంతో కంకర తేలి వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. రూ.1.40 కోట్ల నిధులతో గత ప్రభుత్వ హయాంలో చెరువు కాలువపై వంతెన నిర్మించారు. వర్షాలు కురిసిన సమయంలో చెరువు నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయేవి. ఒ క్కోసారి రోడ్డు పూర్తిగా మునిగిపోయిన సందర్భాలు ఉన్నాయి. వంతెన నిర్మించడమే మేలు అని భావించి కల్వర్టు స్థానంలో వంతెన నిర్మాణం పూర్తి చేశారు. కానీ ఈ పనులు చేసిన కాంట్రాక్టరుకు బిల్లులు మంజూరు కాకపోవడంతో తారు వేయ కుండా అలాగే వదిలేశారు. తారు వేస్తేనే రోడ్డుపై కంకర తేలకుండా ఉండి రాకపోకలకు ఇబ్బంది ఉండదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రోడ్డుపై తారు వేయించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



తారు వేయకుండా వదిలివేసిన తొర్తి- పాలెం రోడ్డు మార్గం

అభివృద్ధిపై నిబద్ధత లేని కాంగ్రెస్ సర్కారు

ఆర్మూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై నిబద్ధత లేకపోవడంతో ఆలూరు బైపాస్ రోడ్డు అనాథగా మారిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆలూరు బైపాస్ రోడ్డు, అక్కడ నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలూరు బైపాస్ రోడ్డు పొడవునా కరెంటు లైట్లు పెట్టడానికి కూడా మున్సిపల్ డబ్బులు లేవా? అని నిలదీశారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పథకాలు, నిర్మాణాలపై నిర్లక్ష్యం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలూరు బైపాస్ రోడ్డును నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఆలూరు బైపాస్ రోడ్డుపై శ్రద్ధ వహించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని జీవన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.



పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

కార్మికులకు దుప్పట్ల పంపిణీ

వర్ని: మండల కేంద్రంలో గురువారం మాదాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులకు, నిరుపేదలకు దుప్పట్లు ను పంపిణీ చేశారు. మండలంలోని ఐదు జీపీలకు చెందిన కార్మికులకు, వర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు దుప్పట్లతోపాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ ఠాగూర్, నగేశ్, కృష్ణ, కనకరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

భూమిపూజ



బోధన్‌రూరల్: పట్టణంలోని శ్రీచక్రేశ్వర శివాలయంలో భక్తుల వసతి కోసం నిర్మించిన గదుల పనులకు గురువారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో సభ్యులు హరికాంత్ చారి, లక్ష్మణ్, భూమేశ్, లింగం, డీసీసీబీ మాజీ చైర్మన్ గంగాధర్ పట్వారీ తదితరులు పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,000	వెండి(కిలో)	93,000
22 క్యారెట్స్	73,500		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	20	గాజరుగడ్డ	40	60
బెండకాయ	40	70	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	40	70	దోసకాయ	30	50
దొండకాయ	40	60	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	25	50
వంకాయ	30	50	బీట్‌రూట్	40	60
పాలకూర	30	50	కరివేపాకు	50	70
మెంతికూర	30	50	చామగడ్డ	35	60
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	35	60
క్యాప్సికం	50	70			

– సుభాష్‌నగర్

మావో ఆలోచనా విధానాన్ని కొనసాగిద్దాం



నిజామాబాద్ సిటీ: నగరంలోని నాగారంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మావో జయంతిని గురువారం నిర్వహించారు. మావో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాకార్యదర్శి బి.భాస్కర్ మాట్లాడుతూ.. చైనాలో విప్లవాగ్ని రాజేసి విజయవంతంగా అతివాద, మితవాదులను మట్టికరిపించాడని అన్నారు. మావో ఆలోచనా విధానంతో దేశంలో ప్రతిఘటన పోరాటాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వరదయ్య, అల్తాఫ్, గంగాధర్, సతీశ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటం

నిజామాబాద్ సిటీ: ప్రజా సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటాలు చేస్తోందని, అందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఐ నాయకులు అన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని శ్రద్ధానంద్ గంజ్ నుంచి అంబేడ్కర్ కాలనీ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. సీపీఐ జెండాను జిల్లా కార్యదర్శి పి సుధాకర్ ఆవిష్కరించారు. అనంతరం నాయకులు ఓమయ్య, సుధాకర్ మాట్లాడుతూ.. సీపీఐని 1925లో కాన్పూర్‌లో ఆవిర్భవించి దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని పోరాటం చేసిందని గుర్తుచేశారు. నిజాం మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసిన ఘనత పార్టీదేనన్నారు. మలిదశ ఉద్యమంలో సైతం ముందుండి పోరాడిందన్నారు. కేంద్రంలోని బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. వందేళ్ల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రంజిత్, ఇమ్రాన్ అలీ, సఖి, సురేశ్, భాను, పరశురాం, హైమది, కవిత, దేవేందర్, హనుమాన్లు, సంపత్, సాయిలు, సాయమ్మ, అమర్ పాల్గొన్నారు.

కోటగిరిలో..

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో సీపీఐ శతజయంతి ఉత్సవాలను గురువారం పార్టీ నాయకులు నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిపిన ఘన చరిత్ర సీపీఐదేనని అన్నారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలు, మహిళలపై, మైనారిటీలపై దాడులు పెంచిందని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేండ్లు దాటినా రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలు అమలు చేయలేదన్నారు. సీపీఐ మండల కార్యదర్శి ఎ విఠల్ గౌడ్, బి రాజు, రా ములు, శివరాజు, శంకర్, హన్మాండ్లు, ఇమ్రాన్, నారాయణ, సాయిలు, హర్షద్ నాయకులు పాల్గొన్నారు.



కోటగిరిలో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గంలో తెయూ నాయకులకు చోటు





అమృతాచారి, మోహన్

తెయూ(డిచ్‌పల్లి): ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గంలో తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి నాయకులకు చోటు లభించింది. ఈనెల 23 నుంచి 25వ తేదీల్లో సిద్దిపేటలో నిర్వహించిన తెలంగాణ 43వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి నేతృత్వంలో ఏబీవీపీ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల్లో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమితి సభ్యుడిగా అమృతాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మోహన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అమృతాచారి, మోహన్ మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఏబీవీపీ రాష్ట్ర శాఖలో స్థానం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర శాఖకు, ఇందూరు విభాగ్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావం పెంపొందించేలా కృషి చేస్తామని వారు తెలిపారు.

వెండితెర | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ -4.30
	పుష్ప-2(తెలుగు)-7.00
	బేబీజాన్(హిందీ)-10.40
స్క్రీన్-2	బేబీజాన్(హిందీ)-1.00
	పుష్ప-2(తెలుగు)-4.00
	యుఐ(తెలుగు)-7.40
	మార్క్స్(తెలుగు)-10.20
స్క్రీన్-3	ముఫాసా(తెలుగు)3డీ-11.00, 5.00,7.30
	పుష్ప-2(తెలుగు)-1.20,10.00

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-11.10,3.15
	మార్క్స్(తెలుగు)-7.20
	ముఫాసా(3డీ ఇంగ్లీష్)-10.15
స్క్రీన్-2	ముఫాసా(3డీ తెలుగు)-10.30, 1.20,7.30 బరోజ్-3డీ -4.10
	పుష్ప-2 (హిందీ)-10.20
స్క్రీన్-3	బేబీజాన్(హిందీ)-11.00,10.40
	పుష్ప-2(హిందీ)-2.30,6.35
	డ్రింకర్ సాయి(తెలుగు)-1.25
	శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ -4.35
	బేబీజాన్(హిందీ)-7.20
స్క్రీన్ -4	మార్క్స్(తెలుగు)-10.30,10.50
లలితామహల్	యుఐ(తెలుగు)-11.15, 2.15
	విడుదల పార్ట్-2(తెలుగు)-6.15,9.15
దేవి	ముఫాసా(2డీ తెలుగు)
నటరాజ్	మార్క్స్(తెలుగు)
విజయ్	పుష్ప-2 (తెలుగు)